andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3 ; కనిష్ఠం 25.7
నిర్మల్ జిల్లా వార్తలు
సోమవారం 15 జులై 2024



డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు : డీఎం

నిర్మల్ కల్చరల్, జూలై 14 : డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఈనెల 18 నుంచి ఆర్టీసీ నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 3 గంటలకు, రాత్రి 11:30కి ఈనెల 24 వరకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగా ఆర్టీసీ ఆన్‌లైన్‌లో గానీ, నిర్మల్ బస్టాండ్ కౌంటర్‌లో గానీ రిజర్వ్ చేసుకొని అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.



● డ్రై డేలో భాగంగా సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న జిల్లా ఆరోగ్య శాఖ అధికారి

● సీజనల్ వ్యాధుల నివారణ నియంత్రణపై జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్

ముసురుతున్న వ్యాధులు!

- అడ్డుకట్ట కోసం స్పెషల్ యాక్షన్ ప్లాన్
- ఆరు శాఖలతో రంగంలోకి..
- ర్యాపిడ్ రెస్పాన్స్ టీంల ఏర్పాటు
- డాక్టర్ల కొరతతో వైద్యం అందక పల్లె ప్రజలకు ఇబ్బందులు
- మంగళ, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా డ్రై డేలు





నిర్మల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఓ వైపు డెంగ్యూతో పాటు వైరల్ జ్వరాలు ఇతర రోగాలు జనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రస్తుతం వర్షకాలమే అయినప్పటికి వాతావరణం భిన్నంగా ఉంటుండడం రోగాలకు మరింత ఆస్కారమిస్తోంది. అరకొరగా వర్షాలు పడుతుండగా వేడి తీవ్రత మాత్రం యధావిధిగానే కొనసాగుతోంది. దీంతో ప్రస్తుతం భిన్నమైన వాతావరణ పరిస్థితులను జనం ఎదుర్కొంటున్నారు. బ్యాక్టీరియా వైరస్‌లకు ఎంతో అనుకూలంగా ఉన్న ఈ వాతావరణ పరిస్థితులు ప్రజలకు మాత్రం ప్రాణసంకటంగా మారుతున్నాయి. రోజురోజుకు వైరల్ జ్వరాల పీడితుల సంఖ్య పెరుగుతోందంటున్నారు. జిల్లా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు నిర్మల్, ఖానాపూర్, భైంసా నియోజకవర్గాల్లోని ప్రైవేటు ఆసుపత్రులన్నీ జ్వరాలతో బాధపడుతున్న వారితో కిటకిటలాడుతున్నాయి. క్రమంగా వైరల్ జ్వరాల తీవ్రత అందరికీ విస్తరిస్తోంది. వైద్యారోగ్య శాఖ సీజనల్ వ్యాధులపై అప్రమత్తమవుతూ దీనికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించింది. కలెక్టర్ అభిలాష అభినవ్ సీజనల్‌వ్యాధులపై ఇప్పటికే పలుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి ముందు జాగ్రత్తలకు సంబంధించిన కార్యచరణను ఖరారు చేశారు. దీంతో వైద్యారోగ్యశాఖతోపాటు మున్సిపాలిటీ, పంచాయతీ, ఐసీడీఎస్, మెప్మా, డీఆర్డీవో శాఖల సిబ్బందిని ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములను చేస్తున్నారు. ఆరు శాఖలను సమన్వయ పరుస్తూ ఈ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కలెక్టర్ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడంతో ఈ ఆరు శాఖల అధికారులు అప్రమత్తమవుతున్నారు. అయితే ఎక్కడికక్కడ ఈ వ్యాధులను అరికట్టేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను సైతం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా దాదాపు ఎనిమిది కేంద్రాల్లో డాక్టర్లు లేకపోవడం రోగులకు శాపంగా మారుతోంది. సాధారణ చికిత్సలు నిర్వహించే వైద్యులు అందుబాటులో లేని కారణంగా వందలాది మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ డబ్బులు చేజార్చుకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం రోగాలు ముదిరి పాకాన పడకముందే ప్రజలను చైతన్య పరుస్తూ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

ఆరు శాఖల సమన్వయంతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

వైద్యారోగ్య శాఖతోపాటు మున్సిపాలిటీ, జిల్లా పంచాయతీ, ఐసీడీఎస్, మెప్మా, డీఆర్డీఓ శాఖలు ఇక నుంచి జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టనున్నాయి. సంబంధిత అధికారులంతా తమ తమ పరిధిలోనే కాకుండా జిల్లా స్థాయిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ప్రజల్లో అవగాహన లేక అలాగే సీజన్ మారడంతో వారంతా రోగాలకు చేరువవుతున్నారు. ఆరు శాఖల ఆధ్వర్యంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ టీంలు ఏదైనా గ్రామంలో జ్వరాలు విస్తరిస్తే వెంటనే అక్కడికి వెళ్లి వైద్యారోగ్య శిబిరాలు ఏర్పాటుచేయడం అలాగే బాధితులకు బాసటగా నిలవడం లాంటి చర్యలు తీసుకోనున్నారు. కాగా ఈ ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ప్రతిరోజూ తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను జిల్లా కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు వివరించాల్సి ఉంటుంది. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం

● డాక్టర్ ధనరాజ్, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి, నిర్మల్



వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య, ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంది. అక్కడక్కడ వైరల్ ఫీవర్స్ వచ్చినా, వెంటనే చికిత్సలు అందించేందుకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటికే మందులను అందుబాటులో ఉంచాం. అలాగే విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి ప్రస్తుతం తీవ్రమైన జ్వరాలు, ఇతర వ్యాధులు ఎక్కడా నమోదు కాలేదు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్యశాఖ పూర్తి అప్రమత్తతో సిద్ధంగా ఉంది.

వెంటాడుతున్న డాక్టర్ కొరత..

జిల్లాలో మొత్తం 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు యూపీహెచ్‌సీలు, మరో మూడు బస్తీ దవాఖానాలతో పాటు 106 సబ్ సెంటర్‌లున్నాయి. ఇందులో నుంచి 73 సబ్ సెంటర్‌లు పల్లె దవాఖానాలుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విస్తృతంగా సీజనల్ వ్యాధులపై సిబ్బంది ప్రచారం నిర్వహిస్తున్నారు. అయినప్పటికి విష జ్వరాలు, డెంగ్యూ వైరల్ జ్వరాలు జనాన్ని వరుసగా వెంటాడుతూ అతలాకుతలం చేస్తున్నాయి. కాగా ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆ మండలాలకు కనీస స్థాయిలో వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడుతోంది. తానూర్, లోకేశ్వరం, మహగాం, వెల్మల్ బొప్పారం, కుభీర్, పెంబి, దస్తూరాబాద్ పీహెచ్‌సీల్లో ప్రస్తుతం వైద్యులు కొరత ఉండడంతో అక్కడి మండల ప్రజలు వైద్య సేవల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. వైద్య రంగానికి ప్రస్తుత ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ఈ డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అవసరమైన మేరకు వైద్య సిబ్బందిని కూడా నియమించాలని అంటున్నారు.

పల్లె జనాన్ని వెంటాడుతున్న పారిశుధ్య సమస్య..

గ్రామీణ ప్రాంతాల్లో జనాన్ని పారిశుధ్య సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. గ్రామ పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయని కారణంగా ఆ గ్రామాల్లో పారిశుధ్యపనులు చేపట్టలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం, అడుగడుగునా చెత్తచెదారం పేరుకుపోవడం, దీని కారణంగా దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తుండడం రోగాలకు కారణమవుతోందని అంటున్నారు. ముఖ్యంగా దోమలు తీవ్రంగా జనాన్ని పీడిస్తూ జ్వరాలకు చేరువ చేస్తున్నాయని చెబుతున్నారు. మురికి గుంటలు, కాలువలు, పరిసరాల అపరిశుభ్రత, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం లాంటి అంశాలన్నీ రోగాలకు తోడవుతున్నాయంటున్నారు. ఇకనైనా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జనానికి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంటున్నారు.



స్వామిని సత్కరిస్తున్న దేవస్థానం చైర్మన్, ఈవోలు

పరోపకారం ప్రతీఒక్కరు చేయాలి

● శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి

దిలావర్‌పూర్, జూలై14: ప్రతితీ మనిషి పరోపకారాన్ని కోరుకోవాలని నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామివారు ఉద్బోధించారు. మండలంలోని శ్రీకదిలి పాపహేశ్వర ఆలయంలో బాల బ్రహ్మానంద సరస్వతి స్వామివారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవి భాగవత ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి, సౌభాగ్యాలు పరిడవిల్లుతాయని చెప్పారు. స్వార్థం, ద్వేషం, క్రోదాలను వదిలి పెట్టాలని చెప్పారు. అనంతరం దేవస్థానం చైర్మన్ నార్వాడి వెంకట్రావు, ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్‌గౌడ్ స్వామివారిని ఘనంగా సత్కరించారు. అంతకముందు బ్రహ్మానంద స్వామి వారిని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ రాష్ట్ర సమావేశాలకు హాజరైన నిర్మల్ సభ్యులు

నిర్మల్ కల్చరల్, జూలై14: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సమావేశానికి నిర్మల్ జిల్లాకు చెందిన సభ్యులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు సాధం అరవింద్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నేరెళ్ల ప్రమోద్ పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలతో ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.

భక్తులతో కిటకిటలాడిన అడెల్లి దేవాలయం

సారంగాపూర్, జూలై 14 : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి పెరుగన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు. అలాగే అడెల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సభ్యులు అడెల్లి నుండి డప్పు మేళాల మధ్య కాలినడకన 5 కిలోమీటర్ల పాటు వెళ్లి అటవీ ప్రాంతంలో గల కోనేరు నుంచి నీరు తెచ్చి అమ్మవారికి అభిషేకాన్ని చేసి మొక్కులను మొక్కి ఏడాది పాటు గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అటవీ ప్రాంతంలో గల కోనేరు నుంచి తెచ్చిన నీరును పంట పొలాల్లో చల్లారు. అనంతరం భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.



కోనేరు వద్దకు కాలినడకన వెళ్తున్న గ్రామస్థులు

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జూలై14: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. యువకులు మద్యం సేవించడం ద్వారా కలిగే అనర్థాలపై తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. రెండోసారి పట్టుబడితే కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతీరోజు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా బస్టాండ్, వ్యాపార సముదాయాల్లో నిత్యం పోలీసు జాగిలాలతో తనిఖీలు చేప డుతున్నామని పేర్కొన్నారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణా నిరోధించేందుకు నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన రెండు పోలీసుజాగిలాలతో తనిఖీలు చేయిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు కనిపెట్టడంలో జాగిలాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. నిషేధిత గంజాయి విక్రయిస్తున్నట్లు గానీ, రవాణా చేస్తున్నట్లు గాని తెలిస్తే 8712659599 నెంబర్‌కు లేదా, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. రెండురోజులు నిర్వహించిన నాకాబందీలో మొత్తం 664 కేసులు నమోదు చేశామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో 565 హెల్మెట్ లేకుండా నడిపిన వారుండగా 66 నెంబర్ ప్లేట్లు లేనివిగా నమోదు చేశామని వివరించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

దస్తురాబాద్, జూలై 14: ప్రేమ విఫలమైందని ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గొడిసిర్యాల్ గ్రామానికి చెందిన పానుగంటి పవన్ (21) తన ప్రేమ విఫలమైందని ఈనెల 11న బంధువులకు, మిత్రులకు ఫోన్‌లో చెప్పి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పవన్‌ను చికిత్స కోసం నిర్మల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు ఇన్‌చార్జి ఎస్సై శంకర్ తెలి పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్సై శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మార్కెట్‌లో లభ్యమైన వ్యక్తి మృతదేహం

నిర్మల్ కల్చరల్, జూలై 14: నిర్మల్ పట్టణం గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలించామని మృతుడి వయస్సు 50పైబడి ఉండవచ్చని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన బంధువులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదాల నివారణకు విస్తృత తనిఖీలు

● డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ కల్చరల్, జూలై14: ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని నిర్మల్ డివిజనల్‌లో వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మద్యం తాగడం, అతివేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుస ప్రమాదాలకు గురయ్యారన్నారు. వాహన బీమా లేనివారికి ప్రమాదాల్లో మృతి చెందితే ఎలాంటి ఆర్థిక సహాయం అందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రతీరోజు నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారని వివరించారు. సరైన ఆధార పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకున్నట్లు తెలిపారు.

'బదిలీ అయిన ఉపాధ్యాయులకు స్థానాలు కేటాయించాలి'

నిర్మల్ కల్చరల్, జూలై14: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవర్ రాక పాత స్థానాల్లోనే ఉండిపోవలసి వస్తోందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆదివారం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను కొత్త స్థానాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకోవాలని వినతి చేశారు.

రోడ్డుపై యథేచ్ఛగా కేజ్‌వీల్ ట్రాక్టర్!

భైంసా, జూలై14: తారు రోడ్లపై యథేచ్ఛగా కేజ్‌వీల్ నడవడంతో రోడ్లు దెబ్బతింటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి రోడ్లు వేస్తుండగా.. కొందరు రోడ్లపై కేజ్‌వీల్ వాహనాలు నడిపి రోడ్లను పాడుచేస్తున్నా సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం ఒకవేళ కేజ్ వీల్ రోడ్డుపై నుంచి వెళ్లాలంటే దమ్ముచక్రాలకు రబ్బరు తొడుగులు బిగించి పంట పొలాలకు తీసుకెళ్లాలి. లేదా దమ్ముచక్రాలను పొలం వద్దే బిగించి పనులు చేసుకోవాలి. కానీ ట్రాక్టర్ యజమానులు రోడ్లపై కేజ్ వీల్ తీసుకపోవడంతో రోడ్లు చెడిపోతున్నాయి. రోడ్లపై కేజ్‌విల్ నడపవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత ట్రాక్టర్ యజమానులు నియమని బంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్



ఒకే వేదికపై 1994-95 పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై మస్కాపూర్ జడ్పీఎస్ఎస్ 1994-95 పదవ తరగతి విద్యార్థులు

ఖానాపూర్, జూలై14: మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అ'పూర్వ' ఘట్టం ఆవిష్కృతమైంది. ఆదివారం 30ఏళ్ల తర్వాత పాఠశాల ప్రథమ పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన గురువులను సన్మానించి వారి గురుభక్తిని ప్రదర్శించారు. 30ఏళ్ల తర్వాత తిరిగి తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలిసిన వారంతా ఒకరినొకరు ఆలింగనాలు చేసుకొని మంచి చెడులు తెలుసుకున్నారు. ఈ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో 1994-95 మస్కాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల 10వ తరగతి ప్రథమ బ్యాచ్‌కు చెందిన 40మంది విద్యార్థులు, పది మంది ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలిశారు. ఆనందబాష్పాలతో ప్రారంభమైన ఈ సమ్మేళనం బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ ముగిసింది.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, జూలై14: స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన పలువురు ఉపాధ్యాయులను ఆదివారం స్నేహమిత్ర బృందం సన్మానించింది. నరేంద్రబాబు, అశోక్‌రెడ్డి, ప్రవీణ్ పదోన్నతి పొందారు. డాక్టర్ పీజీ రెడ్డి, కేపీరెడ్డి, సాయిరెడ్డి, రవికిరణ్, రాజేశ్వర్ రెడ్డి, సాయన్న పాల్గొన్నారు.

శివాలయంలో చిన్నారుల శ్రమదానం

సారంగపూర్, జూలై14: మండలంలోని బోరిగాం గ్రామంలో గల శివాలయం ఆవరణలో స్థానిక కాలనీకి చెందిన పలువురు చిన్నారులు ఆదివారం శ్రమదానంచేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు తుపాకుల వెంకటరమణా చారి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఆలయం ఆవరణలో పిచ్చిమొక్కలతోపాటు గడ్డి ఏపుగా పెరగడంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని తెలిపారు. దీంతో స్థానిక కాలనీకి చెందిన చిన్నారులు పెద్దమనస్సుతో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేయడం గొప్ప విషయమన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ కూడా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రమదానం చేసిన చిన్నారులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్, గౌతమ్, శైనిక్ చంద్ర, రిష్విక్ చంద్ర, గంగోత్రి, ఆదిత్య, మణికంఠ, నైనిక, ప్రనీష, గగణశ్రీ, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న చిన్నారులు

'బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 14: బీడీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నేతలు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో కళావతి, గంగమ్మ, తారబాయి, తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని పింఛన్‌దారుల గుర్తింపు

బోథ్, జూలై 14: ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న వారు మృతి చెందడంతో వారి కుటుంబాల వారికి ప్రభుత్వపరంగా పెన్షన్ అందిస్తున్నారు. అయితే ఓ వైపు ప్రభుత్వపరంగా అంది పెన్షన్ తీసుకుంటూనే.. మరో వైపు మండలంలో ఐదుగురు ఆసరా పెన్షన్ తీసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అయితే ఈ ఐదుగురి పేర్లతో కూడిన జాబితాను జిల్లా ఉన్నతాధికారులు మండల పరిషత్ కార్యాలయానికి పంపడం జరిగింది. కాగా, ఆ జాబితాలో ఉన్న వ్యక్తుల సమాచారం కోసం అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు వారు ఇంతకాలం తీసుకున్న పింఛన్ డబ్బులను సైతం రికవరీ చేయనున్నట్లు సమాచారం. కాగా మండలంలో అనేక గ్రామాల్లో ఆసరా పెన్షన్ భార్యాభర్తలు ఇరువురు పొందుతున్నట్లు పలు గ్రామాల్లో ఆరోపణలున్నాయి. వాస్తావానికి ప్రభుత్వం కుటుంబంలో ఒకరికి మాత్రమే పెన్షన్ అందిస్తుండగా.. ఇద్దరూ పెన్షన్ తీసుకునే వారి జాబితాను సైతం పరిశీలించాలని కోరుతున్నారు.

నిరుద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : బీఆర్ఎస్

బోథ్, జూలై 14: నిరుద్యోగులను ఇబ్బందుల పాలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, డీఎస్సీ పరీక్షలు రాయనున్న స్థానికులకు ప్రభుత్వం పరీక్ష కేంద్రాలను నల్గొండ, ఖమ్మం జిల్లాలో వేయటం వల్ల నిరుద్యోగులు.. ముఖ్యంగా మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎం.ప్రవీణ్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల నిరుద్యోగులు ఆదిలాబాద్ జిల్లా నుంచి వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇకముందు అయినా ప్రభుత్వ అధికారులు పరీక్ష కేంద్రాలను విద్యార్థుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.



సదర్మాట్ బ్యారేజీ వద్ద మాట్లాడుతున్న గ్రామస్థులు

'ఆలయం నిర్మించాకే బ్యారేజీని ప్రారంభించాలి'

మామడ, జూలై 14: సదర్మాట్ మినీ బ్యారేజీ ప్రారంభించకముందే నాగదేవత ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని పొన్కల్ గ్రామసమీపంలోని గోదావరిపై నిర్మించిన సదర్మాట్ మినీ బ్యారేజీని ఆదివారం గ్రామస్తులు సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రారంభానికి సిద్ధమైన ప్రాజెక్టు సమీపంలోని రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని అన్నారు. 2017లో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీ భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీష్‌రావు, అధికారులు ఆలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారని అది ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఆలయ నిర్మాణం కోసం ఆరుఎకరాల భూమిని కేటాయించారని, అలాగే పవిత్రమైన నాగదేవత దర్శనం కోసం వివిధ జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు. కనుక ముప్పుకు గురవుతున్న ఆలయాన్ని వెంటనే నిర్మించాలని, లేనియెడల ఆందోళన చేస్తామని, ఈఆలయాన్ని నిర్మించిన తర్వాతే సదర్మాట్ ప్రాజెక్టును ప్రారంభించాలని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోంద్ర రాజారెడ్డి, గ్రామస్థులు సుధాకర్‌రెడ్డి, నర్సారెడ్డి, నిమ్మతోట గంగారెడ్డి, బాలరాజు, చిట్యాల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత

• ఫారెస్ట్ అధికారుల అదుపులో డ్రైవర్, వాహనం



పోలీసులు పట్టుకున్న వాహనంలో బంధించి ఉన్న అడవి పందులు

నర్సాపూర్(జి), జూలై 14 : మండలంలోని డొంగుర్‌గాం గ్రామ సమీపంలో పోలీసులు ఆదివారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా పశువులను తరలిస్తున్న ఓ మినీ అశోక్‌లీలాండ్ వాహనాన్ని గుర్తించారు. పోలీసు వాహనాన్ని చూసిన సదరు డ్రైవర్ వేగంగా పారిపోతుండగా ఆ వాహనాన్ని పోలీసులు వెంబడించి డొంగుర్‌గాం సిద్దేశ్వర మందిరం వద్ద పట్టుకున్నారు. అయితే అందులో ఉన్నవ్యక్తి వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. పోలీసులు ఆ వాహనం వద్దకు వెళ్లి చూడగా అందులో ఐదు అడవి పందులు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆ వాహనానికి చెందిన డ్రైవర్ గంట తర్వాత అక్కడికి రావడంతో పోలీసులు అదుపులో తీసుకుని విచారించగా తాను ఈస్టు గోదావరి చెందిన వాడినని, తన వెంకటేశ్వర్‌రావు తెలిపాడు.డ్రైవర్‌తోపాటు వాహనాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నిర్మల్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న వాహనం ఇదే..

భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌గిరి

ముథోల్‌కు వరించేనా?

• చైర్మన్ పదవిపై సీనియర్ల ఆశలు • ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు • మండల నాయకులకు ఇవ్వాలని డిమాండ్

ముథోల్, జూలై14: నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ మండల నాయకులకు భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ తీవ్రమవుతోంది. ముథోల్ పేరుకే నియోజకవర్గం కేంద్రమైనా ప్రతీసారి మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు అందకుండా పోతోందని కాంగ్రెస్ కార్యకర్తలు మథనపడుతున్నారు. గతంలో ఒకే ఒక్కసారి మాత్రమే ముథోల్ మండలానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కిందని పలువురు కార్యకర్తలు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ఈ సారైనా ముథోల్ మండల నాయకులకు మార్కెట్ కమిటీ పదవి దక్కుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం

• సీనియర్ల ఎదురుచూపులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పలువురు సీనియర్, యువ కార్యకర్తలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో మండలంలోని ఆయా గ్రామాల నాయకులు పని చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆపద సమయంలో కూడా పార్టీ అభిమానులు, కార్యకర్తలు పార్టీ కోసం పనిచేశారు. దీంతో ఆశావహులు తమకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కుతుందన్న ఆశలతో ఉవ్విళ్లూరుతున్నారు.

• ముమ్మర ప్రయత్నాలు

ఉత్తర తెలంగాణలో భైంసా మార్కెట్‌కు మంచి గుర్తింపు ఉంది. మార్కెట్‌లో కూడా పంటల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగుతాయి. దీంతో కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం మండలంలోని పలువురు నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నామినేటెడ్ పదవి కావటంతో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్ చారి మద్దతు కీలకంగా మారింది. వారి మద్దతు కోసం మండల నాయకులు విశ్వప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి ముథోల్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరిస్తుందో లేదో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కోలూర్‌లో ఉచిత వైద్య శిబిరం

తానూర్, జూలై14: మండలంలోని కోలూర్ గ్రామంలో ఆదివారం భైంసా పట్టణంలోని ఆరూష్ చిల్డ్రన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నరేష్ బందెల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో భాగంగ ఉచితంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ చంద్రకళ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీరా, మిర్జాపూర్ కార్యదర్శి మహేష్, నాయకులు కే. సురేష్‌పటేల్, భూమారెడ్డి, షేక్ పాషా, జ్ఞానేశ్వర్, ఎం. సంజీవ్ బి.రాజు షేక్, అహ్మద్‌షేక్, సలీం, ధర్మేందర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆషాఢ మాస బోనాలు

• డప్పు వాయిద్యాల మధ్య ఆలయాలకు.. • మొక్కులు చెల్లించుకున్న భక్తులు



మారెమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న దృశ్యం



ఆలయం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నిర్మల్ అర్బన్, జూలై 14 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ఆదివారం ఊరూరా ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసం ప్రారంభం నుంచి చివరి దాకా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పిస్తుంటారు. ఈ మేరకు పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్‌లో ఆదివారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. పాడిపంటలు బాగుండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రజలు మొక్కుకున్నారు. కాలనీ నుంచి సమీపంలోని మారెమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఊరేగింపులో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

కుంటాల, జూలై 14: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, కళశ స్థాపన, పుణ్యాహవచనం, అభిషేకం, తదితర ప్రత్యేక కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాత జన గామ ఆర్టీవో శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ప్రకాష్‌గౌడ్, రమేష్‌గౌడ్, నర్సాగౌడ్, రామనూజ గౌడ్ తదితరులు పాల్గొని ఆదివారం బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెత్తిన బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గజ్జలమ్మ ఆలయం వరకు భాజా భజంత్రిలతో వెళ్లారు. అనంతరం గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనమెత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణ రావు, అప్క గజ్జారాం యాదవ్, నాయకులు వెంగల్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ 35 కి.మీ. రన్!

• నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు రన్నింగ్ చేసిన నిర్మల్ వైద్యుడు



ఖానాపూర్ వైపు పరుగెత్తుతున్న వైద్యుడు

నిర్మల్ అర్బన్, జూలై 14: జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు లక్ష్మీనర్సింహారెడ్డి నిర్మల్ పట్టణం నుంచి ఖానాపూర్ వరకు 35 కిలోమీటర్లు నాన్‌స్టాప్ రన్ చేసి రికార్డు నమోదు చేశారు. ఆదివారం ఆయన నిర్మల్ నుంచి ఉదయం 6 గంటలకు రన్నింగ్ ఒక్కరే ప్రారంభించి ఉదయం 9 గంటల 51 నిమిషాలకు ఖానాపూర్ కొమురం భీమ్‌చౌరస్తాకు చేరుకున్నారు. నిర్మల్ టూ ఖానాపూర్ నాన్‌స్టాప్ రన్ చేసిన ఆయనకు ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ ఫౌండర్ వాల్గోట్ కిషన్ అభినందించారు. వాకింగ్, సైక్లింగ్‌తో ఆరోగ్యంగా, రోజంతా చురుకుగా ఉం టారని లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు.

వృద్ధులకు దుర్గామాత ఆలయంలో వనభోజనం

నిర్మల్ కల్చరల్, జూలై 14: నిర్మల్ పట్టణం దుర్గామాత ఆలయంలోని పరిసరాల్లో ఆదివారం నిర్మల్ హృదయ సేవా సమితి ఆధ్వర్యంలో డవ్ వృద్ధాశ్రమ వృద్ధులకు వనభోజనం ఏర్పాటు చేశారు. సమితి గౌరవ అధ్యక్షుడు నార్లపురం రవీందర్, అధ్యక్షుడు నాయుడి రమేష్, శ్రీరాముల శ్రీనివాస్, వై.సాయన్న, తదితరులు పాల్గొన్నారు.



వనభోజనం నిర్వహిస్తున్న నిర్వాహకులు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు

ఆర్కిటెక్, ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 14: నవాబ్‌అలీ నవాజ్‌జంగ్ బహాదూర్ జయంతి సందర్భంగా తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఆదిలాబాద్ ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్ అండ్ ఎల్‌టీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్కిటెక్ ఇంజనీర్స్ అండ్ ఎల్‌టీపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నదానం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రవుఫ్, కోశాధికారిగా మాటేటి రాజు,ఉ పాధ్యక్షులుగా బేర్రశ్రీనివాస్, సయ్యద్ సాబిర్‌అలీ, సంయుక్త కార్యదర్శులుగా సుశాంత్, అల్మాస్‌ఖాన్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని అభినందనలు తెలిపారు.రెండేళ్ల పాటు సంఘానికి అందించిన సేవకు గాను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని నూతన అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వర్, సందీప్, గౌతమి, సరిత, యోగేశ్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో సందడిగా గోరింటాకు వేడుక

ఇచ్చోడ, జూలై, 14: చేతినిండ గోరింటాకు పెట్టుకునే మహిళలకు కష్టాలుండవని పురాణాలు చెబుతున్నాయని మహిళలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహేష్ నివాసంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున హాజరైన మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు. మహిళలంతా గోరింటాకు పెట్టుకుని సందడి చేయడంతో పండగ వాతావరణం నెలకొందని మహిళలు పేర్కొన్నారు. దీంతో సందడిగా గోరింటాకు వేడుకను మహిళలంతా కలిసి ఒక్కచోట గడుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్‌లో హైడ్రామా

• కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్ • పార్టీ శ్రేణుల ఆందోళనతో మళ్లీ బీజేపీలోకి • గంటల వ్యవధిలోనే కండువాలు మార్చిన కౌన్సిలర్



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీజేపీ కౌన్సిలర్



తిరిగి బీజేపీలో చేరుతున్న కౌన్సిలర్ రాజేష్

ఆదిలాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఆదివారం సాయంత్రం హైడ్రామా చోటు చేసుకుంది. ఈనెల 18న ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై అవిశ్వాస తీర్మానం తేదీని జిల్లా కలెక్టర్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాన పార్టీలు తమ పంతం నెగ్గించుకునేందుకు పట్టు బిగిస్తున్నాయి. బీజేపీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ పిన్నావార్ రాజేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. దీంతో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐలు, పోలీసు బలగాలు బీజేపీ కార్యకర్తల ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులతో బీజేపీ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. దీంతో లాఠీచార్జీ చేసి ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు.పోలీసుల తీరుకు నిరసనగా బీజేపీ కార్యకర్తలు ఆర్ఎస్ గార్డెన్ వద్ద బైఠాయించారు. కంది శ్రీనివాస్‌రెడ్డి ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లను బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారంటూ ఆరోపించారు. అయితే గంటల వ్యవధిలోనే కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్ పిన్నావార్ రాజేష్ తిరిగి బీజేపీ పార్టీలో చేరిపోవడంతో ఆందోళన సద్దుమణిగింది.



బీజేపీ శ్రేణులపై లాఠీచార్జీ చేస్తున్న పోలీసులు

పంటపొలాలు ప్లాట్లుగా మారినా..

అందుతున్న పెట్టుబడి సహాయం!

బోథ్, జూలై 14: బోథ్ మండలంలో వ్యవసాయ సాగు భూములు దాదాపు ఒక వంద ఎకరాల వరకు పంట భూములన్నీ ప్లాట్లుగా మారాయి. కొంత మంది నాలా పన్ను చెల్లించి వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే భూములుగా మార్చుకున్నారు. అయితే మండల కేంద్రంతో పాటు పక్కనే ఉన్న పిప్పలదరి, కుచలాపూర్, కౌటా(బి), సోనాల గ్రామాలలో వ్యవసాయ భూములు, వాణిజ్య అవసరాల కోసం మార్చుకున్నారు. అయితే నాలా పన్ను చెల్లించి ప్లాట్లుగా మార్చి డీటీసీపీ అనుమతి పొందింది. కేవలం 20 ఎకరాల వరకు మాత్రమే ఉందని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. మరో 80 ఎకరాల వరకు ఉన్న భూముల్లో దాదాపు 50 ఎకరాల వరకు నాలా పన్ను చెల్లించడం జరిగింది. ఆ భూములకు రెవెన్యూ రికార్డుల్లో మాత్రం గ్రామ కంఠం భూములుగా ఉన్నట్లు తెలిసింది. ఆ భూములకు తహసీల్దార్ సంతకం లేదనేది ఆన్‌లైన్‌లో తేలింది. అయితే దాదాపు మార్చుకున్నది మండలంలోని కుచలాపూర్, బోథ్, సోనాల, కౌటా(బి) గ్రామాలలో అనధికారికంగా వెలసిన ప్లాట్లు ఇళ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. అయితే వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములకు సైతం రైతు పెట్టుబడి సహాయం అందుతుందని తెలిసింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్లుగా మార్చి వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకుంటున్న భూములకు గతంలో పెట్టుబడి సహాయం అందితే వారికి రికవరీ గతంలో ఇచ్చిన పెట్టుబడి సహాయం తిరిగి చెల్లించాలని ఆదేశాలు వస్తున్నాయి. దీంతో మండలంలో దాదాపు 30 ఎకరాలలో ప్లాట్లుగా మార్చిన వారికి పెట్టుబడి సాయం అందడంతో రికవరీ నోటీసులు రానున్నట్లు తెలిసింది. అయితే, సంబంధిత శాఖల అధికారులు మరింత లోతుగా పరిశీలిస్తే.. అనేక గ్రామాల్లో అనధికార ప్లాట్లు వెలిసినట్లు సమాచారం.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఎంవో తొడసం చందు

పీపీ యూనిట్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, జూలై 14: ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌ను ఆదివారం ఆర్ఎంవో తొడసం చందు తనిఖీ చేశారు. ఆ శాఖ ద్వారా రిమ్స్‌లోని శిశువులకు వేసిన టీకాల వివరాలను సూపర్‌వైజర్ సుగుణ ద్వారా సమీక్షించారు. టీకాలు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ప్రతి శని, బుధవారాల్లో ప్రత్యేక శిబిరాలతోపాటు ప్రసూతి వార్డులో జన్మించిన శిశువులకు టీకాలు వేయడంతోపాటు తల్లిదండ్రులకు కూడా టీకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బంగారిగూడ ఘటనలో నలుగురి అరెస్టు

ఆదిలాబాద్ రూరల్, జూలై 13: దళితుడిని కులం పేరుతో దూషించి కర్రలతో గాయపరిచిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10న ఆదిలాబాద్‌లోని బంగారిగూడలో సూర్యకాంత్‌ను పలువురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి గాయపర్చడమే కాకుండా కులం పేరుతో దూషించినట్లు, కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు జరిపి అమీర్, మోసిన్, సల్మాన్, షేక్ ఫైజలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

'ఉత్తమ సేవలతో గుర్తింపు'

బోథ్, జూలై 14: ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించి ఉత్తమ సేవలు అందిస్తే ప్రజలు గుర్తిస్తారని వైద్య ఆరోగ్య శాఖలో పదవి విరమణ పొందిన రాథోడ్ బాబులాల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దేవలా నాయక్ తండ గ్రామంలో పదవీ విరమణ పొందిన రాథోడ్ బాబులాల్‌ను సేవాలాల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో సేవలు అందించడం గొప్ప విషయమని, ప్రాణాలను అడ్డుపెట్టి సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జై సేవాలాల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బాబులాల్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు



● హీరాపూర్ వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



● భీర్సాయిపేట వద్ద గుంతలు పడ్డ ఆర్‌అండ్‌బి రోడ్డు



● దంతనపల్లి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వంతెన

నిండా.. నిర్లక్ష్యం!

- జిల్లాలో పలుచోట్ల గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్లు
- సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏజెన్సీ ప్రాంతంలో మరీ అధ్వానం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహనదారులు
- నిత్యం రోడ్డు ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న నిండు ప్రాణాలు
- నిధులు మంజూరవ్వక.. ముందుకు సాగని రోడ్ల మరమ్మతులు
- ఇటీవల ఏజెన్సీ రోడ్లను పరిశీలించిన ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్
- త్వరగా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న జిల్లావాసులు

ఉట్నూర్, జూలై 14: జిల్లాలో రోడ్లు భవనాల శాఖ అధికారుల నిండా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా.. రోడ్లకు వంతెనలకు మరమ్మతులు చేయించడంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు నిండా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ రోడ్డు, లింగోజితండా ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్ రోడ్డు, ఉట్నూర్ నుంచి మంచిర్యాల రోడ్డులపై గుంతలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. గుంతలు పూడ్చడంలో సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆర్‌అండ్‌బీ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్లు

ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే దారిలో దంతనపల్లి వంతెన వద్ద పదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వంతెనకు ఉన్న అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ నాసిరకం పనులు చేయడం వల్ల తిరిగి అదే స్థానంలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఫలితంగా ఈ గుంతల వద్ద ప్రతీనిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు వంతెన వద్ద గుంతలు కనిపించక పోవడంతో సడన్ బ్రేకులు వేసి కొందరు ప్రమా దాలకు గురి అవుతున్నారు. అలాగే, మరికొందరు భారీ కుదుపునకు గురి అవుతున్నారు. దంతనపల్లి నుంచి బలాన్పూర్ క్రాస్ రోడ్డు నుంచి బీర్సాయిపేట వరకు, బీర్సాయిపేట నుంచి గండి వరకు రోడ్డుకు గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు గత ఐదేళ్లుగా గుంతలు పడి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మరింత ఇబ్బందులు చేస్తున్నప్పటికీ.. మరమ్మతులు చేయించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. ఈ రోడ్డు మరమ్మతులకు అటవీ శాఖ అనుమతులు లేవని ఆర్‌అండ్‌బీ అధికారులు తప్పించుకుంటుండగా.. ఇప్పటికే అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం జరిగిందని ఆ శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం. ఇదే కాకుండా ఉట్నూర్ మండలం లింగోజి తండా ఎక్స్‌రోడ్డు నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారి సైతం పూర్తిగా గుంతలమయంగా మారింది. లింగోజి తండా ఎక్స్‌రోడ్డు నుంచి చీమనాయక్ తండా, లాల్‌టేకిడి, హీరాపూర్, శంకర్ తండా, హస్నాపూర్, దేవుగూడ, నార్నూర్‌చౌరస్తా, హనుమాన్‌టెక్డి వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ వైపు రహదారి పై కూడా గుంతలు ఏర్పడ్డాయి. గత యేడాది కురిసిన భారీ వర్షాలకు పులిమడుగు వంతెన వద్ద, శంకర్‌గూడ సమీపంలోని చెరువు వద్ద, రోడ్లు కొట్టుకు పోయి ప్రమాదకరంగా తయారు కావడంతో తాత్కాలిక మరమ్మతులను చేశారు. పులిమడుగు వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఉట్నూర్ మండలం షాంపూర్ వాగు వద్ద నాగపూర్ వాగు వద్ద, ఎందిరుకు వంతెన వద్ద, సమక వంతెన వద్ద, ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శంకర్‌గూడ వద్ద భారీ వంతెన నిర్మించి ఏళ్లు గడుస్తున్న అధికారుల నిర్లక్ష్యం వల్ల సదరు కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా ఖనిజాలు(బండరాళ్లు) ఏర్పాటు చేయక పోవడంతో ఇక్కడ కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలు లేక పోలేదు.

నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం!

రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రోడ్లకు మరమ్మతులు చేపట్టక పోతుండడంతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జిల్లాలో ప్రతిరోజూ ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయంటున్నారు. అయితే, నిత్యం ఇదే రోడ్లపై తిరుగుతున్న ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం స్పందించక పోతుండడంతో గత రెండేళ్లలో ఈ రోడ్లపై ప్రమాదాలు చోటు చేసుకుని పదిమంది వరకు ద్విచక్ర వాహనదారులు మృతి చెందారని ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిధంగా వర్షాలు కురుస్తుండగా.. రోడ్లకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు వరద నీరు వెళ్లి పోవడానికి కాలువలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ కాలువలు ఎకడా కూడా నిర్మించకపోవడంతో రోడ్లపై వర్షపునీరు నిలబడి ప్రమాదాలు జరుగుతున్నా యని ప్రజలు పేర్కొంటున్నారు. ఉట్నూర్ పట్టణంలోని ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై కోర్టు సమీపంలో ఎదురుగా ఉన్న రహదారిపై చిన్న వర్షానికి వరద నీరు నిలిచిపోతుంది. అదేవిధంగా బస్టాండ్ సమీపంలోని వంతెన వద్ద కూడా వర్షపు నీరు నిలబడి చెరువుల తలపిస్తున్నప్పటికీ.. పాలకులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యాన్ని నివారించి రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్డు నుంచి హనుమాన్ టెక్డి వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల ఆర్‌అండ్‌బి రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తుంది. ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.మూడు కోట్లు మంజూరు చేసి ఇప్పటి వరకు 13 సార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, గత అక్టోబరు నుంచి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్‌అండ్‌బీ పనులు చేయడానికి ఇష్టం చూపడం లేదని తెలుస్తుంది. బీర్సాయిపేట రోడ్డు మరమ్మతులకు సకాలంలో అనుమతులు రాకపోవడంతో కాంట్రాక్టర్ వెళ్లి పోగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ఉట్నూర్ ప్రాంతంలో రోడ్లను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

: అరవింద్, ఏఈఈ, ఆర్‌అండ్‌బి

ఉట్నూర్ ప్రాంతంలో ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్ల పరిస్థితిని ఈనెల 11న ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ పరిశీలించారు. ఆసిఫాబాద్, బీర్సాయిపేట రోడ్లకు మరమ్మతుల కోసం మరోసారి అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవనున్నామన్నారు. అంతేకాకుండా జిల్లాలోని పలుచోట్ల మూడు వంతెనల మరమ్మతుల కోసం డిసెంబరు నెలలో పనులు చేపట్టడం జరుగుతుంది.

సంక్షిప్త సమాచారం



జలపాతం వద్ద జాలువారుతున్న నీరు



కుంటాల జలపాతం వద్ద పర్యాటకులు

జాలువారే అందాలు!!

● కుంటాల జలపాతం వద్ద సందడి

నేరడిగొండ, జూలై 14: మండలంలోని కుంటాల జలపాతం జాలువారే అందాలను వొలకబోస్తున్నాయి. జాతీయ రహదారికి అనుకొని ఉన్న కోర్టికల్ జలపాతం ఆ దారిగుండా వెళ్లే వాహనదారులతో పాటు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అలాగే కుంటాల జలపాతానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల సందడి మొదలైంది. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. జాలువారే అందాలతో పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు.

ప్రజల సౌకర్యార్థం చౌకధరల దుకాణాలు : ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 14: మండల ప్రజల సౌకర్యార్థం చౌకధరల దుకాణాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలో సుదూర ప్రాంతాల ప్రజలు రేషన్ సరుకులు తీసుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడడాన్ని గమనించి సంబంధిత అధికారులతో మాట్లాడి నూతనంగా మండలంలో పదిరేషన్ షాపులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఇక నుంచి వారివారి గ్రామాలలో నిత్యావసర సరుకులు తీసుకోవడం జరుగుతుందన్నారు. నూతనంగా చౌకధరల దుకాణాల ఏర్పాటుతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

గురుకుల కళాశాల నుంచి నలుగురు సిబ్బంది బదిలీ

బోథ్, జూలై 14: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి నలుగురు బోధన సిబ్బంది బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ స్వర్ణలతతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ కావడం జరిగింది. అయితే గత 15 సంవత్సరాల కాలంగా ప్రిన్సిపాల్ ఇక్కడే విధులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం మెక్ కళాశాలకు బదిలీ కావడం జరిగింది.

జిల్లాలో మొదలైన పీర్ల పండుగ సందడి

● గ్రామాలలో కొనసాగుతున్న వేడుకలు ● తలమడుగు, రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ● తరలివస్తున్న వేలాది మంది భక్తులు



తలమడుగులో ప్రత్యేక పూజలందుకుంటున్న పీరీలు



రుయ్యాడిలో ప్రతిష్ఠించిన పీరీలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 14: జిల్లావ్యాప్తంగా మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని అంకోలి గ్రామ శివారులోని షాదుల్లా బాబా దర్గాలో ఆదివారం ఉదయం మొహరం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పీర్లకు పూజలు చేసి మొహర్రం వేడుకలు ప్రారంభించారు. భక్తులు గుండమాడుతూ డప్పు చప్పుట్ల మధ్య కోలాహలంగా గడిపారు. అనంతరం నిర్వాహకులు మంగారపు మల్లేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

తలమడుగు: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు గ్రామాల్లో మొదలయ్యాయి. అమావాస్య తరువాత వెలువడిన నెల వంక తరువాత జరుపుకునే మొహరం పండుగ ఉత్సవాలు గ్రామాల్లో కుల మత వర్గ విభేదాలకు తావియకుండా ప్రతి ఒక్కరూ జరుపుకుంటారు. వారం రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రాంతం జిల్లాలో ఎక్కువగా జరుపుకుంటారు. ముఖ్యంగా తలమడుగు రుయ్యాడి పీరీలకు ఘనమైన చరిత్ర ఉండటంతో వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రుయ్యాడి హుస్సేన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి ముందస్తు ఏర్పాట్లు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 18 వరకు మొహరం ఉత్సవాలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా తలమడుగు మండల కేంద్రంలో మొహరం ఉత్సవాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేపట్టారు. రాత్రిపూట స్థానిక సవరి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన అగ్ని గుండం వద్ద ప్రతీరోజు రాత్రి భక్తులు అచ్చదుల అంటూ కోలాటం ఆడుతూ పండుగను జరుపుకుంటారు.









చెట్లు కొట్టేసి.. నాలాలో పడేసి!!

వర్షాకాలం.. నేపథ్యంలో విద్యుత్ తీగలకు చెట్లు తగులుతున్నాయనే ఉద్దేశంతో ఆ శాఖ అధికారులు వాటిని కొట్టేస్తున్నారు. ఆ కొమ్మలను వేరే ప్రాంతంలో పడేయాల్సి ఉండగా.. అక్కడే రోడ్డు మీద వదిలేస్తున్నారు. పక్కనున్న మురికి కాల్వల్లో పడేస్తుండడంతో నాలాలు జామ్ అయి మురుగునీరు పారడం లేదు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



చెట్లను కొట్టేసి రోడ్డకిరువైపుల, మురికి కాల్వల్లో పారవేశారిలా..



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సమయంలో బయటపడ్డ పాము

పాములకు ఆవాసంగా సాయినగర్ కాలనీ

బోథ్, జూలై 14: మండల కేంద్రం సమీపంలోని సాయినగర్ కాలనీలో పాములు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీలో ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు పెరగడంతో రాత్రిపూట పాములు తిరుగుతుండటంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేక రాత్రి పూట బయటకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీలో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

నామినేటెడ్ పదవుల్లో అన్ని ఉప తెగలకు అవకాశం కల్పించాలి : తుడుందెబ్బ

ఆదిలాబాద్ రూరల్, జూలై 14: తమది ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఆదివాసుల్లోని ఒకే తెగకు ప్రాధాన్యతను ఇవ్వకుండా అన్ని తెగలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఆదివాసులకు నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆదివాసీల్లోని అన్ని తెగలు కృషి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐటీడీఏ ఛైర్మన్ పదవీ మిగితా ఆదివాసీ తెగకు కేటాయించాలని కోరారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నైతం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, సోయం రాందాస్, కంచం గంగాధర్, జిల్లా కార్యదర్శి జాల్కే ముకుంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 14: స్థానిక సంస్థల ఎన్నికలకు ఉద్యమంలా సన్నద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాసేభవన్ క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదన్నారు. పాయల శంకర్, జోగు రామన్నలు ఇద్దరు ఒక్కటేనని, వారిరువురు కలిసి మున్సిపల్ వైస్‌చైర్మన్‌ను గద్దెదించాలని కుట్ర చేస్తున్నారన్నారు. అవిశ్వాస తీర్మానం తర్వాత ప్రజలకు ఏవి పాలు, ఏవి నీళ్లో తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్యనాయకులు, కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని పలు గ్రామాల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

